కాలుష్యం కోరల్లో టేకి డ్రెయిన్

- అంతరిస్తున్న మత్స్య సంపద
- పట్టించుకోని అధికారులు

కె.గంగవరం: నీటి పారుదల వ్యవస్థలో అత్యంత కీలకమైన మురుగునీటి పారుదలను అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పెరుగుతున్న పారిశ్రామికీకరణ డ్రైనేజీలను కాలుష్యం చేస్తున్నాయి. దీంతో డ్రైనేజీని ఆనుకుని ఉన్న రైతాంగంతో పాటుగా మురుగుకాలువల్లో నివసించే మత్స్యసంపద కూడా అంతరించిపోతుంది. మండలంలోని టేకి డ్రైనేజీ ఆనుకుని సుమారు 20 వేల ఎకరాలు పంట సాగు చేస్తున్నారు. ఆలమూరు మండలం వద్ద ప్రారంభమైన టేకి డ్రెయిన్ కపిలేశ్వరపురం, రాయవరం, కె.గంగవరం, కాజులూరు, తాళ్లరేవు మండలాల మీదుగా ప్రవహించి కోరంగి వద్ద సముద్రంలో కలుస్తుంది. సుమారు 56 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ మురుగు కాలువ ఐదు మండలాల్లోని రైతులకు వరప్రదాయినిగా ఉంటుంది. డ్రైనేజీ ప్రారంభంలో చిన్న మురుగు కాలువగా ఉన్న టేకి డ్రెయిన్ కె.గంగవరం, కాజులూరు, తాళ్లరేవు వచ్చేసరికి ప్రధాన మురుగుకాలువగా మారింది. వరదలు, తుపాన్ల సమయంలో టేకి డ్రెయిన్ ఈ ఐదు మండలాల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

కాలుష్యంతో రైతుల గగ్గోలు..

వర్షాకాలం ఖరీఫ్ సీజన్‌లో మురుగునీరు దిగేందుకు ఎంతో ఉపయోగకరమైన టేకి డ్రెయిన్ వేసవి కాలంలో అదేరకంగా వినియోగిస్తూ ఉండేవారు.



దంగేరు వద్ద ఫ్యాక్టరీల నుంచి వచ్చిన వ్యర్థాలతో నల్లగా మారిన టేకి డ్రెయిన్ నీరు

టేకి డ్రెయిన్ ఆనుకుని రైతులు వేసవి కాలంలో పశువులను మేపుకుని తాగునీటి కోసం టేకి డ్రెయిన్‌నే ఉపయోగించుకునేవారు. అయితే రానురాను టేకి డ్రెయిన్‌ను ఆనుకుని పరిశ్రమలు పెరిగిపోవడంతో కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. రాయవరం మండలంలోని సుగర్ ఫ్యాక్టరీ నుంచే మొలాసిస్ నీరు, వ్యర్థాలు టేకి డ్రెయిన్‌లోకి వదలంతో మొత్తం నీరు కాలుష్యం అవుతుంది. టేకి డ్రెయిన్‌లోకి వదులుతున్న మొలాసిస్ నీరు వల్ల ఆయా మండలాల్లోని కాలువ పరిసర ప్రాంత ప్రజలకు దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాకుండా కె.గంగవరం వద్ద పేపర్ మిల్లు వ్యర్థాలు కూడా వదలడంతో టేకి డ్రెయిన్ పూర్తిగా స్వరూపం మారిపోతోంది. ఆయా మండలాల్లోని రైతులు, తమ పశువులను మేపుకునేందుకు, తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టేకి డ్రెయిన్ మీదనే ఆధారపడి ఉన్న మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. వేసవిలో మూడు నెలల పాటు ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థాల వల్ల మత్స్యసంపదతో పాటుగా జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. రాత్రివేళల్లో వాయు కాలుష్యం ఏర్పడి కిలోమీటర్ల మేర గ్రామాల్లో దుర్వాసన వెదజల్లి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ తతంగం జరుగుతున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో పాటు డ్రెయినేజీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. డ్రెయినేజీల్లో కాలుష్యాన్ని అరికట్టే చర్యలు తీసుకోవాలని రైతులు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



కాలుష్యం కోరల్లో నుంచి టేకి డ్రెయిన్‌ను రక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. దాదాపు మండలంలోని 10 గ్రామాల ప్రజలు ఈ డ్రెయిన్ మీదనే ఆధారపడి వరి సాగు చేస్తున్నారు. కాలుష్యం అయిన నీరు వల్ల రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

– రాయుడు నాగేశ్వరరావు, పేకేరు

పశువులకు నీరు దొరకడం లేదు



డ్రెయిన్ నీరు కలుషితమవడం వల్ల పశువులకు నీరు తాగడం లేదు. కాలువకు ఆనుకుని ఉన్న పలు గ్రామాలకు చెందిన పాడి రైతులు ఈ కాలువ చెంతే పశువులను మేపుతుంటారు. పశువులకు నీరు లేక పాడి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

– పిల్లి వెంకటేశ్వర్లు, భట్లపాలిక

సూర్యప్రకాష్ గెలుపు కోరుతూ నవరత్నాల రథం తయారీ



హసన్‌బాద గ్రామస్తులు చేసిన నవరత్నాల రథంతో ఎంపీ బోస్, సూర్యప్రకాష్

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ గెలుపు కోరుతూ ఆయన స్వగ్రామం హసన్‌బాద గ్రామస్తులు నవరత్నాల రథాన్ని తయారీ చేసి ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, సూర్యప్రకాష్‌లకు సోమవారం అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించేలా పొందు పరిచిన కదిలే రథాన్ని ఎంపీ బోస్, సూర్యప్రకాష్‌లు కొంత దూరం కదిలించి గ్రామస్తుల అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

క్లుప్తంగా

గోగులమ్మను దర్శించుకున్న సూర్యప్రకాష్



కాపవరంలో సూర్యప్రకాష్‌కు అమ్మవారి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీటీసీ సతీష్

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరం గ్రామదేవత గోగులమ్మ అమ్మవారి జాతర పురస్కరించుకుని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ సోమవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో మళ్లీ ముఖ్యమంత్రి పీఠం ఎక్కాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు. ఆయన వెంట గ్రామ ఎంపీటీసీ రెడ్నం సతీష్, పీఏసీఎస్ చైర్మన్ గీసాల శివ, మాజీ సర్పంచ్ గీసాల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గీసాల శతకోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి రూ.50 వేల ఆర్థిక సాయం



టేకిలో విద్యార్థిని దేవికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ప్రముఖులు

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి గ్రామానికి చెందిన ఫిజియో థెరపీ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థిని లంకలపల్లి దేవికి హైదరాబాద్‌కు చెందిన బిల్డర్ కాకతీయ గ్రూప్ చైర్మన్ కమ్మ బ్రహ్మాజీ చౌదరి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. విద్యార్థిని లంకలపల్లి దేవి తిరుపతి సమీపంలోని రేణిగుంటలోని ఎస్వీ యూనివర్సిటీలో ఫిజియో థెరపీ కోర్సు ఫస్టియర్ చదువుతుంది. వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన విద్యార్థిని దేవికి కమ్మ బ్రహ్మాజీ సమకూర్చిన ఆర్థిక సాయాన్ని టేకిలో కమ్మ ఆనందరావు, నెక్కంటి బుచ్చిరామారావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వంక రామారావు, శ్రీనివాస్, కృపారావు, మురళి పాల్గొన్నారు.

కేశవరంలో తాటాకిల్లు దగ్ధం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మండపేట: మండలంలోని కేశవరం గ్రామంలోని దేవుడుతాళ్ల కాలనీలో సోమవారం ఓ తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఈ లోగా స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కొద్ది సేపటికే అగ్నిమాపకదళ అధికారులు వాహనంతో సహా అక్కడికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ప్రమాదంపై ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్ రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ సిబ్బంది వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం రూ. 50 వేలు ఉంటుందని అంచనా వేశారు.

పంట తెగుళ్లపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలిదశ నుంచి తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని చేదువాడ, కాజులూరు తదితర గ్రామాల్లో ఏఓ అశోక్ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. చేదువాడలో ఆయన మాట్లాడుతూ వరిసాగులో పంట తొలి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం రాత్రిపూట మంచూ, పగలు అధిక ఉష్ణోగ్రత కారణంగా వరి పంట పలు రకాల వ్యాధులు, తెగుళ్ల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఆర్బీకేలో సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

గడువు లోగా పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

మండపేట: స్థానిక పురపాలక సంఘానికి బకాయి పడిన పన్నులను ఈ నెల 30 లోగా చెల్లించిన వారికి 5 శాతం పన్ను రాయితీ ఇస్తామని మున్సిపల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సోమవారం తెలిపారు. పట్టణ ప్రజలు తమ ఆస్తులకు సంబంధించిన వివిధ రకాల పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకుని ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించాలన్నారు.

వైభవంగా నూకాంబిక తీర్థం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, కపిలేశ్వరపురంలలో నూకాంబిక అమ్మవారి ఆలయాల వద్ద సోమవారం తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అంగరలో అమ్మవారి ఆలయం వద్ద గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో సందడి నెలకొంది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

డిగ్రీ కళాశాలలో అష్టావధానం



మండపేట డిగ్రీ కళాశాలలో అష్టావధానం చేస్తున్న సందీప్‌శర్మ

మండపేట: మారేడుబాక డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని సోమవారం ఆ కళాశాలలోని తెలుగు విభాగం అధ్వర్యంలో అష్టావధానం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు తెలిపారు. ప్రముఖ అవధాని డాక్టర్ తాతా సందీప్‌శర్మ తన 66వ అష్టావధానం చేశారు. సమయోచిత చమక్కులతో అందరినీ అలరించారు. కాకరపర్తి దుర్గాప్రసాద్ నిషిద్ధాక్షరి, గోదావరి కవి ర్యాలి శ్రీనివాసరావు సమస్యా పురాణం, కొరుప్రోలు గౌరీనాయుడు దత్తపది, వారణాసి బ్రహ్మయ్యపంతులు వర్ణన, అవసరాల సుధారాణి వ్యస్తాక్షరి, జి. సింహాచలం ఆసువు, కరుటూరి శ్రీనివాసరావు వారగణనం, తాతా కాశీ వెంకట శ్రీనివాసరావు నిషిద్ధాక్షరిలో శ్రీరాముని పట్టాభిషేక వైభవాన్ని వివరించారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్రలో ఇది తొలి అష్టావధానమని సమన్వయ కర్త, కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎం.మధుకుమార్ తెలిపారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లూ వేయండి



దంగేరు బీసీ సంఘ పెద్దలను కలసిన వైఎస్సార్ సీపీ మండల నాయికులు

కె.గంగవరం: రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్, పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాద్ విజయాన్ని కోరుతూ మండలానికి చెందిన బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన పెద్దలు దంగేరు గ్రామంలో పర్యటించి పెద్దలను కలిశారు. పార్టీ మండల అధ్యక్షులు పెట్టా శ్రీనివాస్, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు తదితరులు మాట్లాడుతూ కులం, మతం పార్టీ భేదాల్లేకుండా టీడీపీ, జనసేన పార్టీల వారికి కూడా సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలు ఏ లబ్ధి కావాలన్నా జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించుకోవాల్సి వచ్చేదని, కానీ జగనన్న ప్రభుత్వం ఏర్పాడిన తరువాత ఈ 58 నెలల్లో అర్హులైతే చాలు సంక్షేమం ఇంటి గుమ్మంలోకే వచ్చేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలు కావాలో ప్రజలకు ఇప్పటికే ఆలోచించి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాబట్టి ప్రజలతా తమ విలువైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాష్‌కు, సీఎంగా జగన్ మోహన్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఓటేయాలని కోరారు. ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సాదే నారాయణరావు, కోటి వెంకట్రావు, వాసంశెట్టి సూరిబాబు, నానాపరపు శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెంలో వేంచేసిన గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం జరగ్గా, అమ్మవారి తీర్థం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సీఎం జగన్‌కు మద్దతునివ్వండి

పలువురు ప్రముఖులను కలసిన ఎంపీ బోస్



సుబ్బయ్యనాయుడు, సతీష్ తదితరులను మర్యాద పూర్వకంగా కలసిన ఎంపీ బోస్, చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: రాష్ట్ర అభివృద్ధికి ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిగా చేసేందుకు మద్దతు నివ్వాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ కోరారు. పట్టణంలోని పలువురు ప్రముఖులను, మాజీ కౌన్సిలర్లను ఆయన సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తన కుమారుడు పిల్లి సూర్యప్రకాష్ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, సూర్యప్రకాష్‌ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పింఛన్ ఎంతమందికి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వచ్చిన మార్పులను గమనించాలన్నారు. అవ్వాతాతలు పింఛన్ కోసం అవస్థలు పడకూడదని వారి ఆత్మగౌరవం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ వ్యవస్థ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని బోస్ వివరించారు. వలంటీర్లతో నేరుగా అవ్వాతాతల ఇంటికే పింఛన్ పంపించారని, గత 56 నెలలుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒకటో తేదీ ఉదయమే పింఛన్ అందించినట్లు ఎంపీ బోస్ వివరించారు. గత ప్రభుత్వం అరకొరగా పింఛన్ ఇస్తే దానిని మార్పు చేసి అర్హత ఉంటే చాలు కుల, మత, రాజకీయాలకు అతీతంగా పింఛన్ అందించినట్లు చెప్పారు. పరిపాలనను సచివాలయాల ద్వారా ప్రజల ముగింటకు తీసుకువచ్చి ఎటువంటి అవస్థలు లేకుండా ప్రజల ఇంటి వద్దకే వారికి కావాల్సిన ధ్రువపత్రాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా చేరుస్తున్న వైనం ప్రజలు గమనించాలని, ఇదే వ్యవస్థ కొనసాగాలంటే తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. తొలుత పట్టణంలోని మాజీ కౌన్సిలర్ వర్దినీడి సీతామహాలక్ష్మి, సుబ్బయ్యనాయుడు, నేతలు పెమ్మనబోయిన సతీష్‌లను ఎంపీ బోస్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనతరం 15వ వార్డు మాజీ కౌన్సిలర్ అన్నంనీడి సాయిరత్నం, సాయిలను ఎంపీ బోస్ కలిశారు. 15వ వార్డు పెద్దలు కామిరెడ్డి హరిబాబు, నాయుడులను కలసి వైఎస్సార్ సీపీకి మద్దతు నివ్వాలని కోరారు. అలాగే పలువురిని కలసి మద్దతు కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, పట్టణ పార్టీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, కౌన్సిలర్ కేతా శ్రీను, ఎం సీతారామలక్ష్మి, పార్టీ నేతలు పెంటపాటి శ్రీనివాసరావు, పోతంశెట్టి గోపాలకృష్ణ, పిట్టానాని తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్టార్ క్యాంపెయినర్లు మీరే..

ఏరుపల్లిలో వృద్ధురాలితో సూర్యప్రకాష్



ఏరుపల్లిలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్

రామచంద్రపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు దోహదం చేసేలా ఆయన కోసం ప్రచారం చేసే స్టార్ క్యాంపెయినర్లు మీరే అంటూ రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ ఒక వృద్ధురాలితో తన ఆనందం పంచుకున్నారు. మండలంలోని ఏరుపల్లిలో ఆ గ్రామ సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, స్థానిక నాయకులతో కలసి ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలు, గ్రామస్తులు పిల్లి సూర్యప్రకాష్‌కు బ్రహ్మరథం పట్టారు. ఒక వృద్ధురాలిని సూర్యప్రకాష్ అమ్మా మీరు జగనన్నకి ఓటు వేయాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వృద్ధురాలికి బ్రోచర్ చూపిస్తుండగా.. బాబూ ఫ్యాన్ గుర్తుకే మేము ఓటు వేస్తాం అంటూ ఆ వృద్ధురాలు ఆయన కంటే ముందుగానే స్పందించడంతో సూర్యప్రకాష్ ఆనందం వ్యక్తం చేస్తూ అమ్మా మీరే జగనన్నకి స్టార్ క్యాంపెయినట్లు అంటూ ఆమెను మెచ్చుకున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

గ్రామ ఎన్నికల ప్రచారంతో భాగంగా టీడీపీ నుంచి ఆ గ్రామ మాజీ సర్పంచ్ సాక్షి వేణుగోపాలరావు, మేడిశెట్టి కనకమురళీకృష్ణ వారి అనుచరులతో కలసి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని సూర్యప్రకాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పల్లా ఆదినారాయణ, రెడ్డి గోవిందు, నందిక వీర్రాజు, బొమ్ము వెంకన్నబాబు, చెల్లే వెంకన్న, దాసరి సూర్యవతి, జడ్డు సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.




వృద్ధురాలితో ఆనందం పంచుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్

కూలీలకు వరం 'ఉపాధి'

- ఏప్రిల్ 1 నుంచి పెరిగిన కనీస వేతనం
- రూ.272 నుంచి రూ.300కు పెంపు
- క్లస్టర్ పరిధిలో 68,873 మంది కూలీలు

మొత్తం జాబ్ కార్డులు:	60,654
యాక్టివ్‌గా ఉన్న జాబ్ కార్డులు:	34,334
కల్పించిన పనిదినాలు:	12,66,110



రాయవరం మండలం నదురుబాదలో నిర్వహిస్తున్న ఉపాధి పనులు

రాయవరం: వ్యవసాయ కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వరంలా మారింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. రబీ పనులు పూర్తయ్యాక, వేసవిలో ఉపాధి హామీ పథకం కూలీలకు జీవనోపాధి కల్పిస్తుంది. ఇప్పటి వరకూ ఉన్న కనీస వేతనం రూ.272 నుంచి రూ.300కు పెరిగింది. ఏప్రిల్ 1 నుంచి పెరిగిన వేతనం అమల్లోకి వచ్చింది. ఈ వేతనాన్ని 2025 మార్చి 31 వరకు ఇస్తారు.

క్లస్టర్‌లో ఇదీ పరిస్థితి

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రామచంద్రపురం, కె.గంగవరం, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలున్నాయి. 94 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణ పథకంలో భాగంగా ఒక్కో ఇంటి నిర్మాణానికి 90 రోజుల వంతున ఉపాధి పని దినాలు కల్పిస్తున్నారు. దీంతో పాటుగా, కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, రోడ్ల వెంబడి నీడ నిచ్చే మొక్కలు నాటడం, హార్టికల్చర్ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ తదితర పనులు ఆయా ప్రాంతాల్లో చేపడుతున్నారు.

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనాన్ని పెంచింది. గతంలో రూ. 272 ఉండగా అదనంగా రూ.28 పెంచింది. ప్రస్తుతం దినసరి కూలీ. రూ.300కు చేరింది. ఉపాధి హామీ పథకం నిబంధనల మేరకు, అధికారులు ఇచ్చిన కొలతల మేరకు పనిచేస్తేనే కనీస వేతనం రూ.300 లభిస్తుంది.

సగటు వేతనం పెరిగే అవకాశం

ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు సగటు వేతనం రూ.264 చెల్లిస్తున్నారు. పనులు చేసే కొలతలను బట్టి సగటు వేతనాన్ని సిబ్బంది నిర్ణయిస్తారు. కనీస వేతనం రూ.272 ఉండగా సగటు వేతనం రూ. 264గా వస్తోంది. కనీస వేతనం పెంపుదల వల్ల సగటు వేతనం మరింత పెరిగే అవకాశం ఉంది. 2023–24 ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగియనుంది. పనిదినాలను లక్ష్యానికి మించి పనిదినాలను పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన కూలీల వేతనాన్ని ఎటువంటి బకాయిలు లేకుండా చెల్లింపులు చేపట్టారు. క్లస్టర్ పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రాయవరం మండలాల్లో యాక్టివ్‌గా ఉన్న జాబ్‌కార్డులు 42,570 మంది ఉండగా, వాటిలో 68,873 మంది కూలీలున్నారు. గత ఆర్థిక సంవత్సరం 2023–24లో 68,873 మంది కూలీలకు 12,75,250 పనిదినాలు కల్పించారు. గత ఆర్థిక సంవత్సరంలో వేతనాలు, మెటీరియల్ రూపంలో రూ.49.05 కోట్లు చెల్లించారు. వీటిలో మెటీరియల్ రూపంలో రూ.15.02కోట్లు, వేతనాల రూపంలో రూ.34,03,87,000లు చెల్లింపులు జరిపారు.

మండలం	జాబ్‌కార్డులు	కూలీలు	కల్పించిన పనిదినాలు	చెల్లించిన వేతనాలు రూ.లో
రాయవరం	6,117	9,400	1,85,761	4,94,55,000
కపిలేశ్వరపురం	8,311	13,174	2,24,903	6,02,95,000
మండపేట	7,176	9,940	2,65,550	7,08,45,000
రామచంద్రపురం	9,752	17,000	2,84,026	7,64,46,000
కె.గంగవరం	11,214	19,359	3,15,010	8,33,46,000

కూలీలకు ప్రయోజనం



ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కనీస వేతనం పెరిగింది. మండలంలో 6,117 మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. కూలీలు పని చేసే దానిని బట్టి వారి సగటు వేతనం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

– జనిపెల్ల సుధారాణి, ఉపాధి ఏపీవో, రాయవరం మండలం

సగటు వేతనం పెరిగేలా ..



ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే యాక్టివ్‌గా ఉన్న కూలీలకు సగటు వేతనం పెరిగేలా చర్యలు చేపడుతున్నాం. పనులు లేని రోజుల్లో ఉపాధి హామీ పనులు కల్పిస్తూ, కూలీలకు లబ్ధి చేకూరుస్తున్నాం.

– ఎం.ఈశ్వరరావు, జూనియర్ ఇంజినీర్, ఎన్ఆర్ఈజీఎస్, రాయవరం మండలం

ఐదు దశాబ్దాల తరువాత ఊడుగులమ్మ జాతర



ఊడుగులమ్మ

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో వేంచేసియున్న ఊడుగులమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక కాలనీకి వెళ్లే రోడ్డులో వేంచేసిన ఊడుగులమ్మ అమ్మవారికి 50 యేళ్ల క్రితం ఉత్సవాలను నిలిపివేశారు. అప్పటి నుంచి జీర్ణోద్ధరణ లేక మూసివేసి ఉన్న ఆలయానికి మళ్లీ పూర్వ వైభవం లభించింది. గ్రామానికి చెందిన అర్చక బ్రహ్మ అవార్డు గ్రహీత కాళ్లకూరి కాశీ శేఖర్‌బాబు నేతృత్వంలో గ్రామస్తులు సహకారంతో ఆలయాన్ని తెరచి రంగుల వేసి సర్వాంగ సుందరంగా తయారు చేశారు. ఈసందర్భంగా తీర్థత్సోవాల సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, శక్తి వేషాలు, కాళీకామాత నృత్యాలు, సన్నాయి వాయిద్య మేళాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక నుంచి ఫాల్గుణ మాస అమావాస్య రోజున ఏటా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయించారు.